

వృత్తి శిక్షణ.. అతివకు భరోసా

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో గోదావరిఖని ఆర్సీవోఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన 14 వృత్తి శిక్షణ కోర్సులను బుధవారం ఆర్జీ-1 జీఎం విజయపాల్‌రెడ్డి ప్రారంభించారు.

10లో..

ఈనాడు
పెద్దపల్లి
గురువారం 24 ఆగస్టు 2017 16 పేజీలు

రణరంగం

- ప్రజాభిప్రాయ సేకరణలో తెరాస, కాంగ్రెస్ వర్గీయుల ఘర్షణ
- పరస్పరం కుర్చీలు విసురుకున్న వైనం
- కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం: ఎంపీ



కుర్చీలు విసురుకుంటున్న కాంగ్రెస్, తెరాస కార్యకర్తలు

పెద్దపల్లి : ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి కోనసీమను మించేలా ఉత్తర తెలంగాణను కాళేశ్వరం ప్రాజెక్టుతో తీర్చిదిద్దుతామని పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ అన్నారు. ప్రాజెక్టులపై అవగాహనారాహిత్యంతో ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేస్తున్నపుడు టీఎంసీలు అంటే తెలియని కాంగ్రెస్ నాయకులు అవివేకంతో సభను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రాఘవపూర్‌లోని రెడ్డి గార్డెన్స్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సభకు ఇన్‌ఛార్జి పాలనాధికారి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసంధానమైన సిరిపురం బ్యారేజీ, అన్నారం, గోలివాడ పంప్‌హౌస్‌ల పై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ఎంపీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా భూసేకరణ జరిగి ప్రాజెక్టు పనులు జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు పనులను అడ్డుకుంటూ ప్రజా ఆగ్రహానికి గురవుతున్నారన్నారు.

రాష్ట్రంలో 13 జిల్లాలో ఉన్న 18.26 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేందుకు గోదావరి, ప్రాణహిత నదుల ద్వారా కాళేశ్వరం-మేడగడ్డ గ్రామం వద్ద ఆనకట్ట, ఎల్లంపల్లి ప్రాజెక్టు మధ్యలో అన్నారం, సుందిళ్ల ఆనకట్టలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించి శరవేగంగా పనులు చేస్తుందన్నారు. 147.71 టి.ఎం.సీలు(శతకోటి ఘనపుటడుగులు) సామర్థ్యంతో 1832 కిలోమీటర్ల ప్రవాహ వ్యవస్థతో అతి పెద్ద సాగునీటి ప్రాజెక్టుగా తీర్చిదిద్ది కోటి ఎకరాల మాగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పూర్తికి పరితపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం కేసీఆర్ ను డౌన్..డౌన్ అంటూ కించపరిస్తే ప్రజలు ఊరుకోరని స్పష్టం చేశారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయబద్ధంగా పరిహారం చెల్లించి ప్రాజెక్టు పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు మిగతా2లో..



ఆందోళనలో పాల్గొన్న శ్రీధర్‌బాబు

ప్రాజెక్టులు అడ్డుకుంటే పుట్టగతులుండవు

- బాల్కసుమన్, ఎంపీ



కోటి ఎకరాల మాగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సంకల్పించిన ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఎక్కడిక్కడ ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి. ఉనికి చాటుకునేందుకు ప్రతిపక్షాల వారు భూ నిర్వాసితులను రెచ్చగొడుతున్నారు. అమాయకుల చేత న్యాయస్థానాలను ఆశ్రయింపజేసి పబ్బం గడుపుతున్నారు. 'ఈనాడు' దినపత్రికలో కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన సమగ్ర సమాచారం ప్రచురించడం అభినందనీయమన్నారు.

13 జిల్లాల ప్రజలకు ఉపయోగం

- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే



రాష్ట్రంలోని 13 జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. వృథా నీటిని ఒడిసిపట్టి తాగు, సాగు నీరు అందిస్తున్నాం. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా మేడిగడ్డ నుంచి సాగు నీటిని విడుదలచేయడం వల్ల 18.26 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. పెద్దపల్లికి డీ-83, డీ-86 కాలువల ద్వారా సాగునీరు అందుతున్నా, ప్రాజెక్టుతో మరింత మేలు కల్గుతుంది.

స్వావలంబన సాధ్యమెలా!

న్యూస్‌టుడే, ధర్మారం:

స్వయం సహాయక సంఘాల ద్వారా పొందే రుణాలకు వడ్డీ ఉండదని ఆశించారు.. స్వయం ఉపాధి పథకాలు, వివిధ అవసరాలకు వినియోగించుకున్నారు.. అయితే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలకు వడ్డీ రాయితీ అందకపోవడంతో మహిళలు నిరాశకు గురవుతున్నారు.. తీసుకున్న అప్పునకు వడ్డీ రాయితీ విడుదల చేయకపోవడంతో వడ్డీతో సహా కిస్తులు చెల్లిస్తున్నారు..

- స్వయం సహాయక సంఘాల నిధుల విడుదలలో జాప్యం
- వడ్డీ రాయితీ కోసం మహిళల ఎదురుచూపులు
- జిల్లాలో రూ.25 కోట్లకు పైగా బకాయిలు

స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేసేందుకు లక్ష్యాలు విధిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం, ఎప్పటికప్పుడువడ్డీ రాయితీ అందించకపోవడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.



స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు

స్త్రీనిధి రుణాలకు ఏడాదిన్నరగా, బ్యాంకు లింకేజీ రుణాలకు రెండున్నరేళ్లుగా రాయితీ అందలేదు. ఈ రెండూ కలిపి జిల్లాలో రూ.25 కోట్లకు పైగా వడ్డీ రాయితీ నిధులు అందాల్సి ఉంది. పేదరిక నిర్మూలన కార్యక్రమం ద్వారా అమలు చేస్తున్న వివిధ బీమా పథకాలదీ ఇదే పరిస్థితి.

స్త్రీనిధి బకాయిలు రూ.13.80 కోట్లు

2016 ఫిబ్రవరి ఇప్పటివరకు జిల్లాలోని 479 గ్రామైక్య సంఘాల పరిధిలో 11,417 మంది సభ్యులు స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకొన్నారు. ఇప్పటివరకు రూ.68.18 కోట్లకు గాను, ప్రతి నెలా రూ.13.5 శాతం వడ్డీ చొప్పున నెలకు రూ.76.71 లక్షలు చెల్లిస్తున్నారు. ఫిబ్రవరి 2016 నుంచి ఇప్పటికి 18 నెలలకు గాను రూ.13.80 కోట్ల వడ్డీ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గతేడాది కేవలం జనవరి నెలకు సంబంధించినవి మాత్రమే విడుదల చేయగా, ఆ తర్వాత అతీగతీ లేదు. ప్రభుత్వం నుంచి వడ్డీ చెల్లించకపోవడంతో మిగతా2లో..

రణరంగం

మంథని ప్రజల త్యాగం మరువలేనిది



- పుట్ట మధుకర్, మంథని ఎమ్మెల్యే

ప్రాజెక్టు నిర్మాణం కోసం మంథని ప్రాంత ప్రజల త్యాగం చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోతుంది. నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది. రాజ్యాంగబద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడితే వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రాజెక్టు పూర్తయితే మంథని ప్రాంతం పంట పొలాలతో విలసిల్లనుంది.

రైతు సోదరుల ఏకాభిప్రాయంతోనే :



- ఈద శంకర్‌రెడ్డి, ఐడీసీ ఛైర్మన్

రైతుల ఏకాభిప్రాయంతోనే ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఐదు దశాబ్దాలుగా మానేరు-హుసెన్‌మియా వాగుల ద్వారా పెద్దపల్లికి సాగునీరు అందజేయని కాంగ్రెస్ నాయకులు ప్రాజెక్టు పనులు అడ్డుకోవడం విడ్డూరమన్నారు. గోదావరి నీళ్లు సముద్రం పాలవకుండా ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను నిర్మిస్తుందన్నారు. దీంతో భూగర్భజలాలు పెరిగి సాగు, తాగు నీటి ఇక్కట్లు తొలగనున్నాయి

రైతాంగానికి ఉపాధి: భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ



సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులపై సీఎం కేసీఆర్ స్పష్టమైన వైఖరి కలిగి ఉన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఊహించని విధంగా నష్టపరిహారం అందివ్వడమే కాక, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఎన్నో అవకాశాలు కల్పించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రాజెక్టు నిర్మాణంతో చివరి ఆయకట్టు భూములకు సైతం నీరు అందిస్తామన్నారు.

(మొదటి పేజీ తరువాయి) పూర్తికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. నిర్వాసితుల సమస్యలను తెలుసుకునేందుకే 82 మందికి సభలో మాట్లాడేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం 282.36 ఎకరాల భూసేకరణకు ప్రతిపాదించగా 115.36 ఎకరాలను సేకరించామని, మిగతా 166.39 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు. నిర్వాసితుల త్యాగాలను కొనియాడారు. ప్రాజెక్టు ఏర్పాటైతే అందరికీ మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే పుట్ట మధుకర్, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, రామగుండం మేయర్ లక్ష్మీనారాయణ, పెద్దపల్లి నగర పంచాయతీ ఛైర్మన్ ఎలువాక రాజయ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రఘువీర్ సింగ్, కాలుష్య నియంత్రణ మండలి కార్యానిర్వాహక ఇంజినీర్ రవిదాస్, ఆర్డీవో అశోక్‌కుమార్, పద్మయ్య, నీటిపారుదల శాఖ సీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రాజెక్టు నిర్మాణానికి సంఘీభావం తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

ప్రజాభిప్రాయ సేకరణలో బాహాబాహీ

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో కాంగ్రెస్, తెరాస నాయకుల పరస్పర వాదనలతో ఉద్రిక్తంగా మారింది. సజావుగా సాగుతున్న సమావేశం.. ఒక్కసారిగా వేడెక్కింది. భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాంభట్ల శ్రీనివాస్ ప్రసంగాన్ని తెరాస వర్గీయులు అడ్డుకోవడంతో ఘర్షణకు ఆజ్యం పోసినట్లయింది. శ్రీనివాస్ సభావేదిక పైనే బైఠాయించారు. ఇన్‌ఛార్జి పాలనాధికారి సంమయనం పాటించాలని ఇరువర్గాలను కోరారు. ఒక్కసారిగా సభాప్రాంగణం రణరంగంగా మారింది. పరస్పరం కుర్చీలను విసిరేసుకుంటూ నినాదాలు చేసుకుంటూ దాడులకు దిగారు. పోలీసులు పరిస్థితిని అదుపులోఇ తీసుకొచ్చేందుకు శ్రమించారు. ఒక దశలో ఇద్దరు ఎమ్మెల్యేలు శాంతించాలని కోరినా పరిస్థితి అదుపులోకి రాలేదు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు కాంగ్రెస్ వర్గీయులను పోలీసులు చెదరగొట్టారు. ఈ క్రమంలో పోలీసులతో శ్రీధర్‌బాబు వాగ్వాదానికి దిగారు. మరోవైపు భూనిర్వాసిత కమిటీ శ్రీనివాస్‌పై కొంతమంది దాడి చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో అతి కష్టం మీద పోలీసులు ఆందోళనకారులను వ్యానులో పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడిలో శ్రీరాంభట్ల శ్రీనివాస్‌కు తీవ్రగాయాలవడంతో కరీంనగర్ అపోలో ఆసుపత్రికి తరలించారు.

పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా

మాజీ మంత్రి శ్రీధర్‌బాబు వర్గీయుల అరెస్టుతో పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా నెలకొంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ వర్గీయులు, నిర్వాసిత మహిళలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రహదారి పై బైఠాయించారు. ఎవరిని స్టేషన్‌లోకి అనుమతించకపోవడంతో రోడ్డు పైనే వేచి చూశారు. పెద్దపల్లి డీసీపీ విజేందర్ రెడ్డి, ఏసీపీ సింధుశర్మ, సీఐ మహేశ్‌లు మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతో సహా 150 మంది కాంగ్రెస్ కార్యకర్తల వివరాలు తీసుకొని నోటీసులు అందజేసి అనంతరం విడిచిపెట్టారు. కాగా ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ మంత్రి శ్రీధర్‌బాబులు విలేకరుల సమావేశం నిర్వహించి ఎవరికి వారే ప్రాజెక్టు గురించి వాదోపవాదనలు, భిన్నాభిప్రాయాలు వెల్లడించారు.

పర్యావరణానికి నష్టం లేదు



- రఘువీర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్

ప్రాజెక్టుతో పర్యావరణానికి ఎలాంటి హాని లేదు. నిపుణులైన ఇంజినీరింగ్ అధికారులతో పనులు సాగుతున్నాయి. తాగు, సాగు నీరు అందించేందుకు బృహత్తర సంకల్పంతో నిర్మిస్తున్నాం. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నిర్మించి తీరుతాం.

ప్రాజెక్టులే భావితరాలకు ఆస్తులు



- కొంతం కృష్ణమూర్తి, విశ్రాంత సీఈ

నిబంధనల ప్రకారమే ప్రాజెక్టుల రూపకల్పన చేస్తారు. ప్రాజెక్టులు భావితరాలకు తరగని ఆస్తులు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటి లభ్యత ఆధారంగా నిర్మాణం చేపట్టడంతో ఆయకట్టుకు ఆయువుపట్టుగా మారనుంది. సహేతుకంగా భూ నిర్వాసితులకు పరిహారం అందజేస్తారు. ప్రాజెక్టుల నిర్మాణం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరికో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

బీడుభూములకు మహర్దశ



- నందనవేని సునీత, ఎంపీపీ, పెద్దపల్లి

బీడు భూములకు మహర్దశ రానుంది. రైతులు రెండు పంటలను సమృద్ధిగా నీరు అందించేలా ప్రాజెక్టు రూపకల్పన చేశాం. వ్యవసాయరంగం అభివృద్ధి చెందడంతో వలసలు తగ్గే అవకాశం ఉంది.

ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలి:



- గుండా మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర నాయకులు

కాళేశ్వరం డిజైన్‌ను మార్చే ప్రక్రియను కేంద్ర జలవనరుల సంఘంతో ప్రభుత్వం చర్చించాకే ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోతున్న వారికి ఎకరాకు రూ. 20లక్షల పరిహారం, ఇంటికొక ప్రభుత్వ ఉద్యోగం, ప్యాకేజీలు ఇవ్వాలి. తమ పార్టీ అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు పై అపోహలను తొలగించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి.

ప్రాజెక్టులతో పేదల పొట్టకొడుతారా?



- శ్రీరాంభట్ల శ్రీనివాస్, జిల్లా భూనిర్వాసితుల సంఘం అధ్యక్షుడు

ఏ ప్రాజెక్టు చేపట్టినా ప్రజా ఆమోదం అవసరం. పేదల పొట్టకొట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే ఎలా? నిర్వాసితుల సమస్యలు పట్టించుకోరా? పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యమేలా? సమాచారం ఇవ్వకుండా నిర్వాసితులకు దూరంగా సమావేశాలు నిర్వహించడం అన్యాయం. మంథని ప్రాంతంలో అత్యధికంగా ముంపునకు గురికావడంతో అక్కడ నిర్వహిస్తే నిర్వాసితులకు తమ గోడు చెప్పుకునే అవకాశం ఉండేది. 1400 ఎకరాల్లో 2 వేల మందికి పైగా రైతులు నష్టపోతే వారికి పరిహారం విషయంలో స్పష్టత లేదు.

స్వావలంబన సాధ్యమెలా!

(మొదటి పేజీ తరువాయి) తీసుకొన్న రుణానికి ప్రతి నెలా రూ.13.5 శాతం చొప్పున వడ్డీతో కలిపి చెల్లిస్తున్నామని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు లింకేజీ మార్చి నాటికే రూ.11 కోట్లు: బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన వడ్డీ రాయితీ 2015 జనవరి వరకు మాత్రమే అందింది. 2015 ఫిబ్రవరి నుంచి రావాల్సి ఉంది. ఈ ఏడాది మార్చి నాటికే బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన మొత్తం రూ.11 కోట్లు రావాల్సి ఉంది. మార్చి నుంచి ఇప్పటివరకు మరో రూ.6 కోట్ల వరకు ఉంటుందని అంచనా. 2015 సెప్టెంబరు వరకు ఎస్సీ, ఎస్టీలు, వికలాంగుల సంఘాలకు వడ్డీ రాయితీ అందింది. అప్పటి నుంచి తిరిగి అందలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లింకేజీ రుణాలను జిల్లాలోని 747 స్వయం సహాయక సంఘాలు రూ.27.72 కోట్లు అప్పుగా తీసుకొన్నాయి. ప్రభుత్వం విడుదల చేయగానే నేరుగా సంఘాల ఖాతాల్లో జమ అయ్యేలా ప్రతి నెలా ఎప్పటికప్పుడు వడ్డీ రాయితీ లెక్కలు వేసి అంతర్జాలం ద్వారా సెర్ప్ యంత్రాంగం వెబ్‌సైట్లో నిక్షిప్తం చేస్తోంది. ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వకపోవడంతో తీసుకొన్న అప్పునకు వడ్డీతో కలిపి సభ్యులు ప్రతి నెలా కిస్తులు చెల్లిస్తున్నారు.

కేంద్రం వాటా చెల్లిస్తున్నా..: స్వయం సహాయక సంఘాలు తీసుకొనే రుణాలకు, బ్యాంకులు తీసుకునే మొత్తాన్ని అనుసరించి వడ్డీ వసూలు చేస్తున్నాయి. రూ.3 లక్షల వరకు 7 శాతం, ఆపై నుంచి రూ.5 లక్షల వరకు 12 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాధుల కల్పన కార్యక్రమం(ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) ద్వారా 4 శాతం వడ్డీ చెల్లిస్తోంది. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే కేంద్రం చెల్లించే 4 శాతం వడ్డీని 2017 జూన్ వరకు చెల్లించింది. ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా కేవలం బ్యాంకు లింకేజీ రుణాలకు మాత్రమే వడ్డీని కేంద్రం చెల్లిస్తుంది. స్త్రీనిధి రుణాలకు నయాపైసా ఇవ్వదు. ఈ వడ్డీని మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. అయితే బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకొన్న రుణాలకు కేంద్రం ఇస్తున్న నాలుగు శాతం పోగా, మిగిలిన వడ్డీని సంఘాలు చెల్లిస్తున్నాయి. స్త్రీనిధి రుణాలు తీసుకొన్నవారు మాత్రం ప్రతి నెలా పూర్తి వడ్డీని చెల్లిస్తున్నారు.

బీమా పథకాల ఊసే లేదు: ఆమ్‌ఆద్మీ బీమా యోజనలో జిల్లాలో 31,788 మంది సభ్యులున్నారు. వీరిలో పురుషులు 29,247, మహిళలు 2,541 ఉన్నారు. వీరిలో ఎస్సీలు 10,957, ఎస్టీలు 1082, బీసీలు 18,759, ఇతరులు 599, మైనార్టీలు 391 మంది ఉన్నారు. ఈ పథకంలో సభ్యులు కేవలం సేవా రుసుము రూ.15 చెల్లిస్తే సరిపోయేది. కేంద్రం, రాష్ట్రం రెండూ కలసి ఒక్కొక్కరికి రూ.365 చొప్పున చెల్లించేవి. ఈ పాలసీదారులకు సాధారణ మరణమైతే రూ.30,000, ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.75,000 అందేవి. కాగా 2015-16 నుంచి నమోదు లేదు. మృతి చెందిన వారికి బీమా అందడం లేదు.

✦ అభయహస్తం పథకం కింద జిల్లాలో 52,770 మంది మహిళా సభ్యులున్నారు. వీరిలో ఎస్సీలు 22.5 శాతం, ఎస్టీలు 4.52 శాతం, బీసీలు 68.08 శాతం, ఇతరులు 3.75 శాతం, మైనార్టీలు 1.09 శాతం ఉన్నారు. ఈ పాలసీదారులు అంతకుముందు సంవత్సరానికి సేవా రుసుములతో కలిపి రూ.385 చెల్లించే వాళ్లు. రాష్ట్రప్రభుత్వం రూ.365 చెల్లించేది. సభ్యురాలు 60 ఏళ్లలోగా మృతి చెందితే ప్రమాదవశాత్తయితే రూ.75,000, సాధారణ మరణమైతే రూ.30,000 బీమా పరిహారం అందేది. 60 సంవత్సరాలు దాటిన వారికి ప్రతి నెలా పింఛను వస్తుంది. 2015-16 నుంచి ఈ ప్రీమియం తీసుకోవడంలేదు. అయితే మృతి చెందిన వారికి బీమా మాత్రం వస్తోంది. 60 సంవత్సరాలు దాటిన వారికి ప్రతి నెలా పింఛను రావాల్సి ఉండగా ఏడాదికోసారి, పదినెలలకోసారి చెల్లిస్తున్నారు. మధ్యలో మృతి చెందినా, సభ్యుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోంది. అభయహస్తం నుంచి ఆసరా పింఛను పథకంలోకి మారిన సభ్యులకు, అంతకుముందు చెల్లించిన మొత్తం చెల్లించాలని, మామూలు సభ్యులు సైతం తాము చెల్లించిన మొత్తం వాపసు ఇవ్వాలని అడుగుతున్నారు. ఈ అంశాలపై సెర్ప్ యంత్రాంగం వద్ద జవాబు లేదు.

✦ ఆమ్ ఆద్మీ బీమా యోజన వర్తించని సభ్యులు జనశ్రీ బీమా యోజనలో చేరారు. ఇందులో సభ్యులు రూ.150 చెల్లిస్తే సరిపోయేది. ఈ పథకంలో 4,997 మంది సభ్యులున్నారు. ఈ సభ్యులకూ బీమా అందడం లేదు. వికలాంగుల జనశ్రీ బీమా యోజనలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 2,158 మంది సభ్యులుండగా, 2015-16 నుంచి పాలసీలను పునరుద్ధరించడం లేదు.

ఉపకార వేతనాలు, స్వావలంబన అంతే!: ఆమ్ ఆద్మీ బీమా యోజన, జనశ్రీ బీమా యోజన, అభయహస్తం పథకాల్లోని సభ్యుల పిల్లల్లో 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే వారికి ఏడాదికి రూ.1200 చొప్పున ఉపకార వేతనాలు అందేవి. ఈ మొత్తం విద్యార్థులకు ఎంతగానో తోడ్పాటునందించేవి. గతేడాది నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు. ప్రతి నెలా పింఛను అందేలా రూపకల్పన చేసిన స్వావలంబన పథకం 2013-14 నుంచి ఉలుకూ పలుకూ లేదు. ఉమ్మడి జిల్లాలో 4,964 మంది పాలసీదారులున్నారు. వీరందరూ సంవత్సరానికి రూ.వేయి చొప్పున మూడేళ్లపాటు ప్రీమియం చెల్లించారు. అయితే మూడేళ్లుగా వీరి వద్ద ప్రీమియం వసూలు చేయడం లేదు. కొందరు సభ్యులు తాము చెల్లించిన సొమ్మును వాపసు ఇవ్వమని అడుగుతుండగా ఇచ్చే ఏర్పాట్లు లేవు. వీరిని కేంద్రం రూపకల్పన చేసిన అటల్ పింఛను బీమా యోజనకు మారాలని మాత్రం సూచిస్తున్నారు.


చెత్తను.. ఏం చేద్దాం!

✦ గుట్టలుగా పేరుకుపోతున్న నిల్వలు ✦ డంపింగ్‌యార్డుకు స్థలాల కొరత

✦ 14 నెలలుగా విద్యుదుత్పత్తి కేంద్రం మూత ✦ తాజాగా 'క్లీన్ ఎయిర్ అథారిటీ' వైపు మొగ్గు



బైపాసురోడ్డులో చెత్తతో నిండిన డంపింగ్‌యార్డు



న్యూస్‌టుడే, కార్పొరేషన్

జిల్లా కేంద్రంలోని కరీంనగర్‌లో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా చెత్త సేకరణ సవాల్‌గా మారింది. రోజురోజుకు పెరుగుతున్న కాలనీలతో చెత్త సమస్య అధికమవుతోంది. సేకరించిన చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా నిర్ణీత స్థలం(డంపింగ్‌యార్డులు) వినియోగించుకోవాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య పనుల నిర్వహణ నిబంధనల ప్రకారం ప్రతి 5 వేల జనాభాకు ఒక ఎకరం డంపింగ్‌యార్డు ఉండాలి. లేనట్లయితే ఆ మేరకు స్థలాలు తీసుకోవాలి. పెరుగుతున్న చెత్తతో డంపింగ్‌యార్డు నిండిపోతోంది. గుట్టలుగా పేరుకుపోయి ఇబ్బందికరంగా మారింది. దీంతో కొత్త డంపింగ్‌యార్డుల కోసం స్థల సేకరణ చేపట్టినా ఇప్పటికీ ఉపయోగించుకోవడం లేదు.

డివిజన్లు 50

నగర విస్తీర్ణం 23.85 చకిమీ

నగర జనాభా (2011): 3.5 లక్షలు

ఇళ్ల సంఖ్య 52 వేలు

చెత్త ఉత్పత్తి (రోజుకు) : 160 మెట్రిక్ టన్నులు

ప్రస్తుతం ఉన్న స్థలం : 17.5 ఎకరాలు

కావాల్సిన స్థలం 45 ఎకరాలు

నగరపాలక సంస్థ పరిధిలో 45 ఎకరాల మేర చెత్త నిల్వ చేసేందుకు స్థలం కావాలని రెండేళ్ల కిందట ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా 10 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. పట్టణాలకు దగ్గరగా రవాణాకు ఇబ్బంది లేని ప్రభుత్వ స్థలాలు అప్పగించాలని ఆదేశించగా.. నగరానికి ఆనుకొని ఎక్కడా ప్రభుత్వ స్థలాలు లేవు. దీంతో 15 కి.మీ దూరంలో స్థలాలు పరిశీలించినా పూర్తి స్థాయిలో సేకరణ చేయలేదు. ఈ విషయంలో పలుమార్లు పాలనాధికారికి దృష్టికి తీసుకెళ్లిన రెవిన్యూ అధికారులు మాత్రం స్థలాలు చూపడం లేదు.

పేరుకుపోతున్న నిల్వలు

నగరంలో ఇంటింటా సేకరిస్తున్న చెత్త నిల్వలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నిల్వలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. రోజుకు టన్నుల కొద్ది చెత్త బయటకు వస్తుండటంతో కనీసం చెత్తతో ప్రత్యామ్నాయంగా విద్యుత్తు తయారీకి, సేంద్రీయ ఎరువుల తయారీకి వినియోగించుకోవడం లేదు. కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ అధ్యయనం ప్రకారం 2 లక్షల్లోపు జనాభా ఉన్న పట్టణాల్లో తలొక్కింటికి 200 గ్రాముల నుంచి 400 గ్రాముల మధ్య చెత్త ఉత్పత్తి అవుతోంది. 3 లక్షల జనాభా ఉన్న పట్టణాలు, నగరాల్లో ఒక మనిషి ద్వారా 500 గ్రాముల చెత్త ఉత్పత్తి అవుతోంది.

ప్రతి ఇంటా సేకరిస్తున్న చెత్తను తీసుకెళ్లి ఎక్కడ నిల్వ చేయాలో తెలియకుండా మారింది.. ఉన్న డంపింగ్‌యార్డు చెత్తతో నిండిపోగా.. కొత్త డంపింగ్ యార్డుకు ఇప్పటికీ చర్యలు తీసుకోకపోగా.. చెత్తను వేరు చేసి విద్యుదుత్పత్తి కేంద్రానికి తరలించే అవకాశం సైతం లేకుండా పోతోంది. ఉన్న అవకాశాలు వినియోగించుకోలేనిపరిస్థితి ఉండగా తాజాగా సర్కార్ 'క్లీన్ ఎయిర్ అథారిటీ' ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపడం చూస్తే ఆచరణలో ఎంతవరకు సఫలీకృతం అవుతుందనేదీ ప్రధాన ప్రశ్న..



వీధుల్లో సేకరిస్తున్న చెత్త



పని చేయని విద్యుదుత్పత్తి కేంద్రం

14 నెలలుగా మూత

ఉమ్మడి జిల్లా పరిధిలోని సుల్తానాబాద్ మండలంలోని సుగ్లాంపల్లిలో చెత్తతో విద్యుత్తు తయారీ కేంద్రం ఉండగా అందులో కొన్నేళ్ల పాటు మున్సిపాలిటీల నుంచి చెత్తను సేకరించారు. సేకరించిన చెత్తతో విద్యుత్తు తయారు చేస్తుండగా టారీఫ్ విషయంలో ప్రభుత్వంతో గిట్టుబాటు కాకపోవడం, నిర్వహణ భారం కావడంతో 14 నెలలుగా మూత పడింది. ఇప్పుడు ఆ విద్యుత్తు తయారీ కేంద్రంలో కార్మికులు సైతం లేకుండా పోయారు.

సిద్ధమవుతున్న కొత్త ప్రతిపాదనలు

కాలుష్యానికి కారణంగా మారుతున్న చెత్తను వేరు చేయడానికి, తిరిగి ఉపయోగించుకోడానికి జపాన్‌లోని టోక్యో మాదిరిగా చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే కేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్కారు భావిస్తోంది. క్లీన్ ఎయిర్ అథారిటీ పేరుతో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దీనిపై కసరత్తు చేస్తుండగా.. ఆచరణలో ఎంతవరకు అమలు చేస్తారనేది తెలియడం లేదు. ఇప్పటికే విద్యుదుత్పత్తి కేంద్రం ఉండగా విద్యుత్తు కొనుగోలు చేయకపోవడంతో అదీ మూత పడింది.

పరిశీలనకే పరిమితం

కరీంనగర్‌లో నలు వైపులా నాలుగు డంపింగ్‌యార్డులు అవసరమవుతాయని నగరపాలక నిర్ణయించి ఆ స్థలాలు కూడా పరిశీలించారు. కమాన్‌పూర్ దగ్గర 10 ఎకరాలు, ముగ్దుంపూర్ శివారులో 10 ఎకరాలు స్థలాన్ని ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వీటితో పాటు బద్ధిపల్లి, సిరిసిల్ల రోడ్డులో, చొప్పదండి వైపు ప్రభుత్వ స్థలాలపై అధికారులు గుర్తించారు. ఒక్క ముగ్దుంపూర్ మినహాయిస్తే ఎక్కడా అనుకూల స్థలం లభించలేదు.

నిధులు సరే.. పనులేవీ?

ముగ్దుంపూర్‌లో పదెకరాల స్థలాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంకేముంది రూ.కోటితో ఆధునాతన డంపింగ్‌యార్డుగా మార్చాలని ప్రణాళికలు తయారు చేశారు. ముందుగా చుట్టు ప్రహరీ, తర్వాత మొక్కలు, పూలమొక్కలు నాటించడం, ఎటుచూసినా పచ్చదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. ఎలాంటి దుర్వాసన రాకుండా, దోమలు రాకుండా ఉండేందుకు, చెత్త నిల్వలు పేరుకు పోకుండా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అవసరమైతే శుభకార్యాల విందులు, అల్పాహార విందులు జరిగేలా డంపింగ్‌యార్డు ఉండాలని నిర్ణయించినా ఇప్పటికీ అడుగు పడటం లేదు.

చెత్తను తగ్గించడమే ప్రధాన లక్ష్యం

- కె.శశాంక, కమిషనర్, నగరపాలిక

ఇళ్ల నుంచి వస్తున్న చెత్తను ఎక్కడికక్కడే వేరు చేయడం, డంపింగ్‌యార్డులకు వచ్చేసరికే అదీ పూర్తిగా తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యల వైపు ఆలోచన చేస్తున్నాం.. తడిపొడి వేరు చేయడం, పొడి నుంచి మళ్లీ వేరు చేయడం వంటి విషయాలపై చర్యలు ప్రారంభించాం. దశలవారీగా చెత్త తగ్గిస్తాం.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ దినోత్సవ వేడకల సందర్భంగా ప్రదానం చేసే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలోని ఎంఈవోలు కేడర్ వారీగా దరఖాస్తులను పంపించాలని జిల్లా విద్యాధికారి పి.రాజీవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులు 1, స్కూల్ అసిస్టెంట్ 2, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు 1, ఫిజికల్ డైరెక్టర్-పీఈటీ 1, ఎల్‌పీటీ-టీపీటీ 1, ఎస్‌జీటీ లేదా సమాన కేడర్ 2 చొప్పున అర్హులైన వారి నామినేషన్లను పంపించాలని సూచించారు. నామినేషన్లను ఎంఈవోలు సీల్డ్ కవర్ ద్వారా నిర్ణీత నమూనాలో ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తమ సిఫారసు ద్వారా పంపాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వారి పాఠశాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, హారితహారం, విద్యార్థుల సంఖ్య పెంచడం, స్వచ్ఛ విద్యాలయం మొదలైన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పీఈటీ లేకుంటే మరో ఉపాధ్యాయున్ని అవార్డు కోసం నామినేషన్‌ను పరిశీలిస్తామని తెలిపారు.

చట్టబద్ధంగా విచారణ జరపాలి : మృత్యుంజయం

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే : కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సంఘటనపై చట్టబద్ధంగా విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలతో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను తెలపడానికి వెళ్తే అధికార పార్టీకి తొత్తులుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, తెపీసీసీ ప్రధాన కార్యదర్శి హర్కాల వేణుగోపాల్‌రావుతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలపై దాడికి దిగి అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని, దాడిని ఖండిస్తున్నట్లు వివరించారు. ఈ విషయంలో జిల్లా పాలనాధికారి పూర్తిగా విఫలమయ్యారనే దానికి ఇది నిదర్శనమని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ మళ్లీ నిర్వహించాలని కోరారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

తెదేపా జిల్లా అధ్యక్షుడు విజయరమణారావు



పత్తి పంటలను పరిశీలించి, మాట్లాడుతున్న విజయరమణారావు

ఓదెల, న్యూస్‌టుడే: నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు డిమాండ్ చేశారు. మండలంలోని గూడెం, మడక, జీలకుంట గ్రామాలలో వర్షాలకు నష్టపోయిన పత్తి పంటను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నకిలీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో గులాబీ పురుగు సోకి, వేరు, ఎండు తెగుళ్ల సోకి పత్తి ఎండిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది ఎకరాల్లో పంట పాడైపోతున్నా అధికారులు, పాలకులు రైతుల వంక కన్నెత్తి చూడటం లేదన్నారు. తెగుళ్లను అరికట్టేందుకు అన్నదాతకు అవసరమైన సలహాలు, సూచనలు అందించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పత్తి పంట నష్టపోయిన అనేక మంది రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి తెగుళ్లను నివారణకు రైతులకు సూచనలు ఇవ్వాలన్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నపుడు నీలం, పైలిన్ తుఫాన్‌లో భాగంగా పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించానన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.750 కోట్లు రైతాంగానికి ఇవ్వాల్సి ఉన్నా ఆ నిధులను పక్కదారి పట్టించారని తెలిపారు. నియోజకవర్గంలో మూడేళ్ల కాలంలో పంట నష్టపోయిన రైతాంగానికి ఎమ్మెల్యే నష్టపరిహారం అందిచలేదన్నారు. పంట నష్టపోయిన వారికి ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట రాములు, నాయకులు ఇంద్రరెడ్డి, సాగర్‌రెడ్డి, బోంగోని శ్రీనివాస్, నీర్ల శ్రీనివాస్, పడాల రాజు, సంపత్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, అరెల్లి వెంకటేష్, ముధుసూదన్‌రెడ్డి, మార్క రాంప్రసాద్, చొప్పరి రాజయ్య, అంకం రమేష్, కిషన్, కర్ర శ్రీధర్, రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మంచి కవిత్వానికి ప్రచారం కల్పించాలి

దాస్యం వెంకటస్వామి స్మారక పురస్కార సభలో నందిని సిధారెడ్డి



సినీ గీత రచయిత మల్లిక్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న నందిని సిధారెడ్డి, కవులు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: నేటి సమాజంలో వరదలా సాహిత్యం పుట్టుకొస్తుంది.. దీన్ని ఎవరూ కాదనలేం.. అయితే మంచి కవిత్వాన్ని ప్రోత్సహించి ప్రచారం కల్పించాల్సిన బాధ్యత సాహితీ సంస్థలపై ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వాగేశ్వరి కళాశాల సమావేశ మందిరంలో సమైక్య సాహితీ ఆధ్వర్యంలో దాస్యం వెంటకస్వామి స్మారక రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్‌కు ప్రదానం చేసి మాట్లాడారు. రచయితలకు పురస్కారాలు ఒకింత ప్రేరణ, ఆహ్లాదాన్ని కల్గిస్తాయని, అయితే మొత్తం సాహిత్యాన్ని తీసుకొచ్చేందుకు దోహదపడవన్నారు. స్వచ్ఛతలేని కవుల సంఘం మాత్రం ఒకరికొకరు పురస్కారాలు ఇచ్చుకొని ప్రాచుర్యం కల్పించుకుంటున్నారని, దీంతో మంచి సాహిత్యం రాకుండా పోతుందనే ఆందోళన కల్గిస్తోందన్నారు. ఇప్పటికైనా మంచి కవిత్వానికి ప్రచారం జరిగితే మరికొందరు స్వచ్ఛత వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమానికి సమైక్య సాహితీ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షత వహించగా పురస్కార గ్రహీత మౌనశ్రీ మల్లిక్, పురస్కార ప్రదాత దాస్యం సేనాధిపతి, డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, సాహితీ గౌతమి కార్యదర్శి గాజుల రవీందర్, కె.ఎస్. అనంతాచారి, గజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పురస్కార పుస్తకం 'తప్త స్పృహ'ను డాక్టర్ కలువకుంట రామకృష్ణ సమీక్షించారు.

పెద్దపల్లి

వడ్కాపూర్‌లో పారిశుద్ధ్య పనులు

వడ్కాపూర్(జూలపల్లి), న్యూస్‌టుడే: వడ్కాపూర్‌లో ఉపసర్పంచి కొత్త శ్రీనివాస్, వార్డు సభ్యులు బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గుంతలు పూడ్చివేయడం, మురుగుకాల్వలు శుభ్రం చేయడం వంటి పనులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అంజయ్య ఉన్నారు.

నూతన నియామకం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే : భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా సుల్తానాబాద్ మండలాధ్యక్షుడిగా నారాయణపూర్‌కు చెందిన కల్లెపల్లి కుమార్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ము తిరుపతి యాదవ్ నియామక పత్రం జారీ చేశాడు.

శుభ్రత కరవు... దోమల దరువు!

18వ వార్డులో వెంటాడుతున్న సమస్యలు

ప్రాంతం: సురభి కాలనీ, ఉదయనగర్, అమర్‌నగర్, ప్రగతినగర్, బస్టాండ్ రోడ్డు, బస్టాండ్ ప్రాంతం
జనాభా: 1562 ఓటర్లు: 1243
ప్రధాన సమస్యలు: మురుగు కాలువలు, సీసీ రోడ్లు

కాలనీ కబుర్లు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: సురభి కాలనీ నుంచి ప్రగతినగర్ మీదుగా బస్టాండ్ వరకు విస్తరించిన అతి పొడవైన 18వ వార్డులో సమస్యలు వీధివీధిలో వెంటాడుతున్నాయి. ఒక ట్రెండు మినహా ప్రతి వాడలో అపరిశుభ్రత తాండవిస్తోంది. బస్టాండ్ ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడి హోటళ్ల నుంచి వ్యర్థాలను వెనక వైపు పారేయగా తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో సమీప ప్రాంతాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాదు పందుల బెడద ఎక్కువగా ఉంది. అభివృద్ధి అనేది పెద్ద వీధులకే మినహా చిన్న వీధుల్లో కానరావడం లేదు. రోడ్లను శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడంతో సీసీ రోడ్లపైనే వర్షం నీరు నిలిచి, బురదమయమవుతోంది. కాలువలు, సీసీ రోడ్లు అసంపూర్తిగానే నిర్మిస్తున్నారు. అభివృద్ధి పనులు కూడా పెద్దల వీధులకే పరిమితయ్యాయనే ఆరోపణలున్నాయి. ఇక కాలువల శుభ్రతను పట్టించుకునే వారే లేకపోవడంతో ప్రతీ వీధిలో దోమల బెడద తీవ్రమైంది.


సంతోషిమాత ఆలయం సమీపంలో సీసీ రోడ్డు దుస్థితి


సురభి కాలనీలో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు

ప్రధానంగా వెంటాడుతున్న సమస్యలివి...

1. సురభి కాలనీలో నిర్మాణం చేపట్టిన మెటల్ రోడ్డును అసంపూర్తిగా వదిలేశారు.
2. ప్రగతి నగర్‌లోని పలు వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించలేదు. ఐబీ వెనుకవైపు సీసీ రోడ్డును మధ్యలో వదిలేయడంతో రెండు వైపులా ఉన్న సీసీ రోడ్డు బురదమయంగా మారుతోంది.
3. సంతోషిమాత ఆలయం రహదారిలో సీసీ రోడ్డును శుభ్రం చేయకపోవడం, ఇక్కడ రోడ్డు కంటే కాలువ ఎక్కువ ఎత్తులో నిర్మించడంతో వర్షం నీరు దారిపై నిలిచి స్థానికులను ఇబ్బంది పెడుతోంది.
4. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా వర్షం నీరు వెళ్లేందుకు పైప్‌లైన్ వేయకుండా రోడ్డుకు అడ్డంగా తవ్వడంతో రాత్రిళ్లు వాహనదారులకు ప్రమాదకరంగా మారింది.
5. బస్టాండ్ సమీపంలోని హోటళ్ల వెనుకవైపు వీధుల్లో శుభ్రత మచ్చుకైనా కానరావడం లేదు.

దోమల బెడద ఎక్కువగా ఉంది: పోసాని సరిత



మురుగు కాలువల్లో చెత్తను సరిగా తొలగించకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. పారిశుద్ధ్య కార్మికులు కూడా చెత్తను సేకరించేందుకు సరిగా రావడం లేదు. మురుగు కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తే ఎలాంటి ఇబ్బందులు రావు. సంబంధిత అధికారులు స్పందించి, వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలి.

నీటి ట్యాంకులు ధ్వంసం: పెండ్యాల సురేందర్



గుప్తా ఆస్పత్రి వీధిలో నిర్మించిన మురుగు కాలువ కాలనీవాసులకు శాపంగా మారింది. రహదారి కంటే రెండు అడుగులు ఎక్కువ ఎత్తులో ఉంది. దీంతోపాటు ఈ కాలనీలో మంచినీటి నల్లాల కోసం నిర్మించిన ట్యాంకులు ధ్వంసం చేశారు. అదేవిధంగా కాలువ నీరు బయటకు వెళ్లేవిధంగా పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే ఆపేశారు.

రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు...



- నూగిళ్ల మల్లయ్య, వార్డు సభ్యుడు

18వ వార్డులో గడిచిన మూడేళ్లలో రూ. 40 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించాం. ఇందులో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలున్నాయి. అయితే పూర్తిస్థాయిలో పనులు నిర్వహించేందుకు మరో రూ. 40 లక్షల వరకు అవసరమవుతాయి. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించి, విడుదలైన వెంటనే పనులు చేపడుతాం.


యాప్‌ను వివరిస్తున్న ఎస్సై రాజు

హాక్‌ఐతో విద్యార్థినులకు మేలు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: హాక్‌ఐ మొబైల్‌యాప్‌తో విద్యార్థినులకు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని ఎస్సై రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాల విద్యార్థులకు షీబృందాలు, హాక్‌ఐ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, విద్యార్థినులను ఎవరూ వేధించినా, మానసికంగా ఇబ్బందులకు గురిచేసినా ధైర్యంగా కుటుంబసభ్యులకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. హాక్‌ఐతో సులభంగా ఫిర్యాదులు, సురక్షిత ప్రయాణం చేయవచ్చన్నారు. కార్యక్రమలో కళాశాల ప్రధానాచార్యులు బండారి కమలాకర్, పూరేళ్ల సదానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై దాడి అమానుషం

ఎలిగేడు, న్యూస్‌టుడే: జిల్లాలోని రాఘవపూర్‌లో బుధవారం జరిగిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణలో కాంగ్రెస్ నాయకులపై తెరాస నాయకులు దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గర్రెపల్లి రాజేశం పేర్కొన్నారు. ఆయన ఎలిగేడులో విలేకరులతో మాట్లాడారు. ప్రజల మధ్యన ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని కోరిన కాంగ్రెస్ వారిపై తెరాస నాయకులు దాడి పోలీసులు లాఠీ ఛార్జి సరికాదన్నారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబును, కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం శోచనీయమన్నారు. తెరాస ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.


సుల్తానాబాద్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

టేకు మొక్కలతో అదనపు ఆదాయం

ర్యాకల్‌దేవుపల్లి(ఎలిగేడు), న్యూస్‌టుడే : గ్రామాల్లోని రైతులు ఖాళీగా ఉన్న వ్యవసాయ భూములు, పొలం గట్లపై టేకు మొక్కల పెంపకం చేపట్టడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని ఏపీడీ కృష్ణ, హరితహారం మండల ప్రత్యేకాధికారి రాజవీరు పేర్కొన్నారు. బుధవారం ర్యాకల్‌దేవుపల్లిలో 25వేల టేకు వేర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజుల్లోగా రైతులకు, గ్రామస్థులకు పంపిణీ చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి హరితహారం లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, టీఏఅఖిల, ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు సాగర్ ఉన్నారు.

పీఆర్టీయూ సంఘం ఎన్నికలు

ఎలిగేడు, న్యూస్‌టుడే: ఎలిగేడు మండల పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలను బుధవారం నిర్వహించారు. మండలశాఖ అధ్యక్షుడిగా మామిడి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొల్లం ప్రవీణ్, అసోసియేట్ అధ్యక్షుడిగా స్వామిరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీత, కార్యదర్శిగా చంద్రమౌళి ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా 60 మంది ఉపాధ్యాయులు సంఘం సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు.

ప్రగతి పత్రాల అందజేత

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కాల్వశ్రీరాంపూర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రగతి నివేదిక పత్రాలను బుధవారం అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారుల ఎదుగుదల, ఆట, పాటలు, అభివృద్ధి చెందుతున్న విషయాలను ప్రగతి నివేదికలో పొందుపరుస్తామన్నారు. నివేదిక కార్డులను చిన్నారులకు అందిస్తున్నామన్నారు. చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన భోజనం అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మాదాసి సతీష్, ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు మంజుల, హజీర, సునీత, జ్యోతి, నాగమణి, శారద, సుమలత, మాధవి, రాజమణి ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.


పెద్దపల్లిలో ప్రగతి పత్రాలను అందజేస్తున్న దృశ్యం

ఓదెల: ఓదెలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులకు ప్రగతి పత్రాలు అందించారు. చిన్నారుల సృజనాత్మకత వెలికితీసి ఆట, పాటలు, విద్యాభ్యాసం చూసి అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు ప్రగతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పెద్దపల్లి: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పోషకాహారంతో పాటు మెరుగైన విద్యా బోధన జరుగుతుందని జిల్లా శిశు సంక్షేమాధికారి పద్మావతి అన్నారు. పెద్దపల్లిలోని పలు అంగన్‌వాడి కేంద్రాల్లో బుధవారం నర్సరీ, ఎల్‌కేజీ చదువుతున్న విద్యార్థులకు ఆమె ప్రగతి పత్రాలను అందజేశారు. కేంద్రాల్లో జరుగుతున్న బోధన విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాలలో కౌన్సిలర్లు సాబీర్‌ఖాన్, ఇల్లెందుల రజనీ, పాగాల సోని, అంగన్‌వాడి సూపర్‌వైజరు జమున, వర్కర్లు స్వరూప, శారద, రమ, సుజాతలు పాల్గొన్నారు.

తేలుకుంట(జూలపల్లి): తేలుకుంట పంచాయతీ పరిధిలోని చీమలపేట, రెండో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు ప్రగతి పత్రాల పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా చిన్నారుల శారీరక మానసిక స్థితిని తెలుసుకోవడానికి ఆస్కారం ఉంది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజనర్సమ్మ, కళావతి పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ఎలిగేడు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి కవిత అన్నారు. బుధవారం ఎలిగేడులో మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను ప్రారంభించి ఆమె మాట్లాడారు. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంచుతాయన్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు ప్రభుత్వం ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను చేపట్టిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. పోటీల్లో రాణించి తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి కోరుకంటి వెంకటేశ్వరరావు, ఎలిగేడు పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షుడు అడ్డగుంట తిరుపతిగౌడ్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు దామోదర్, వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న, సత్యనారాయణ, సంతోశ్, ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కల్గుతుందని మండల విద్యాధికారి నర్సింగం అన్నారు. బుధవారం సుల్తానాబాద్‌లో మండల స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులు పలు ఆటలు ఆడారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, ఉపసర్పంచి అల్లెంకి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు సూరశ్యాం, పల్లా సురేష్, ఈవో అనిల్‌రెడ్డి, ముస్త్యాల రవీందర్, అమిరిశెట్టి తిరుపతి, అంతటి శంకరయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

పెద్దపల్లి

నేత్రాల సేకరణ

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు చుంచు చంద్రమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబీకులు చంద్రమ్మ నేత్రాలను సదాయశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఈ మేరకు పెద్దపల్లి వాసన్ ఐకేర్ వారు నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో సదాయశ స్వచ్ఛంధ సేవా సంస్థ నాయకులు మేరుగు భీష్మాచారి, భువనగిరి రాజు, క్యాతం వెంకటేశ్వర్లు, సారంగం తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులపై నిరసనల వెల్లువ

పోలీస్‌స్టేషన్ ఎదుట హైడ్రామా

పెద్దపల్లి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టులకు నిరసనగా పెద్దపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మంథనికి చెందిన నాయకులు, కార్యకర్తలు రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. వీరంతా ఠాణాలకు చొచ్చుకుపోయేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రెండు గంటల పాటు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. పోలీసులు వీరిని నిలువరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అరెస్టయిన కార్యకర్తలు సైతం స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. వర్షం కురవడంతో కార్యకర్తల ఆందోళన సద్దుమనిగింది. కాగా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ దిష్టిబొమ్మను పోలీస్‌స్టేషన్ ఎదుట దహనం చేశారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్యకర్తలు


శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న విజయరమణారావు

ఉద్రిక్తతల నడుమ..

ప్రజాభిప్రాయ సేకరణ జరిగిన రాఘవపూర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో అరెస్టయిన కార్యకర్తలను పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించే క్రమంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. పోలీస్‌స్టేషన్ వరకు తరలించే క్రమంలో రమ్య అనే కాంగ్రెస్ కార్యకర్త బస్టాండ్ సమీపంలో పోలీస్ జీపులో నుంచి దూకింది. కొందరు కార్యకర్తలు రాజీవ్‌రహదారిపై ఆందోళనకు దిగారు.

శ్రీధర్‌బాబుకు విజయరమణారావు పరామర్శ

పెద్దపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో బుధవారం కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టుల చేశారు. ఈ నేపథ్యంలో అరెస్టయిన మాజీ మంత్రి శ్రీధర్‌బాబును పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి పోరాటానికి ఆయన సంఘీబావం తెలిపారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రం నగదు అందజేస్తున్న దృశ్యం

మానవత్వపు విలువలకు పట్టం

ఓదెల, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే నైతిక విలువలు పెంపొందేలా, మానవత్వపు విలువలకు పట్టం కట్టేలా విద్యాబోధన జరగాలని సర్పంచి ఆకుల మహెందర్ పేర్కొన్నారు. మిషన్ ఎథికల్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఓదెల మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన నీతి కథల పోటీల విజేతలకు బుధవారం బహుమతి ప్రధాన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సర్పంచి విజేతలకు తన వంతుగా నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాధికారి బి. లింగయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ జావిద్ పాల్గొని మాట్లాడుతూ ఫౌండేషన్ ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు మీసాల శేఖర్, ఎస్‌వో మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.


కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇంఛార్జీ పాలనాధికారి ప్రభాకర్‌రెడ్డి

మజీదుల మరమ్మతులకు చెక్కుల పంపిణీ

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లిలోని పలు మజీద్‌ల మరమ్మతుల కోసం రూ. 2,23,398ల చెక్కులను 23 మజీద్‌లకు చెందిన ఇమామ్‌లకు ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, పుట్ట మధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు రఘువీర్‌సింగ్, పెద్దపల్లి తహసీల్దార్ అనుపమ, తెరాస కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యేలు

ఖాతాదారులకు మెరుగైన సేవలు

పెద్దపల్లి: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇండియన్ బ్యాంకు ప్రయత్నిస్తుందని ఆ బ్యాంకు జోనల్ మేనేజర్ నజీబుల్లాఖాన్ అన్నారు. పెద్దపల్లిలోని బ్యాంకు శాఖలో బుధవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 43ఏళ్లుగా ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తుందన్నారు. ప్రజలను డిజిటల్ సేవలవైపు మళ్లించేందుకు బ్యాంకు చర్యలు చేపట్టిందన్నారు. పెద్దపల్లి, కరీంనగర్ శాఖల ముఖ్య కార్యనిర్వాహణాధికారులు రమేష్, కుమార్‌లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఓదెల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అతివేగంతో నడిపి విద్యుత్తు స్తంభానికి ఢీ కొన్న ఘటన ఓదెల మండలంలోని గుంపుల శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన సుంచు సంపత్, మోత్కూరి రమేష్‌లు జమ్మికుంట నుంచి కాల్వశ్రీరాంపూర్ వైపు ద్విచక్రవాహనంతో వేగంగా రావడంతో గుంపుల శివారులో విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొనడంతో సంపత్, రమేష్‌లకు గాయాలైయ్యాయి.

26న జిల్లా జూడో జట్ల ఎంపిక

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న శనివారం కరీంనగర్‌లో జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జూడో జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మెంగాని రంజిత్, సిలివేరి మహేందర్‌లు తెలిపారు. అండర్-11 నుంచి అండర్-15 విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 25కిలోల నుంచి 55 కిలోల వరకు బాలబాలికలకు వేరువేరుగా పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు సెప్టెంబర్ 1నుంచి 3వరకు సుల్తానాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ జూడో పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు వయసు ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు నకలుతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99498 30494 నంబరులో సంప్రదించాలన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు సదాశివ డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లోని మండల వనరుల కేంద్రం ఆవరణలో బుధవారం సామూహిక సెలవు గోడ ప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. పాత పెన్షన్ సాధన కోసం సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టి జిల్లా కేంద్రంలో జరిగే నిరసన దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని మండలంలోని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం బాధ్యుడు జి.మహేందర్, హరికృష్ణగౌడ్, యు.మహేందర్, శివ, రాజేందర్, శ్రీధర్, రమేష్‌చారి, రవీందర్, వెంకటస్వామి, రవి, ప్రవీణ్, రజిత, సరిత, స్వరూప, స్వప్నలు పాల్గొన్నారు.


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఓదెల: పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.నరహరి, టీఎస్ సీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు చిలువేరు సదాశివలు డిమాండు చేశారు. ఓదెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం పెన్షన్ విద్రోహ దినానికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న మండల ఉపాధ్యాయులందరం సామూహిక సెలవు పెట్టి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కిషోర్‌కుమార్, రవీందర్, జనార్దన్, అక్బర్, ప్రభాకర్, పీఆర్‌టీయూ నాయకులు మహేశ్వర్, ఆనందం, సీపీఎస్ చేరాలు, ముస్తపాతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిగేడు: తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఎలిగేడు విద్యావనరుల కేంద్రంలో గోడప్రతిని ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల పింఛన్‌ను ప్రభుత్వం భిక్షగా కాకుండా ఉపాధ్యాయుల హక్కుగా భావించాలన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు సెప్టెంబర్ ఒకటో తేదీన పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. టిఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షుడు గాజుల బాలకృష్ణ, సంఘాల నాయకులు రాంమోహన్, భీమయ్య ఉన్నారు.

జూలపల్లి: తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పోరాట సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1ని పింఛను విద్రోహదినంగా పాటించాలపాక ఉద్యోగ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జూలపల్లి మండల విద్యావనరుల కేంద్రంలోలో గోడప్రతిని ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంజన్ బాబు, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్, వెంకటేశ్వర్లు, శ్రీశైలం పాల్గొన్నారు.

ముమ్మారు తలాక్ తీర్పు పై సంబరాలు

పెద్దపల్లిపట్టణం: ముస్లిం మహిళలకు భరోసా ఇచ్చే ముమ్మారు తలాక్‌పై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల పెద్దపల్లి భాజపా నేతలు సంబరాలు నిర్వహించారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మైనార్టీ మహిళలతో కలిసి మోదీ చిత్రపటానికి కృతజ్ఞతలు తెలిపారు. ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతి నిర్మూలనకు తీసుకున్న నిర్ణయం పట్ల మైనార్టీ మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లెసదానందం, ఎండీ.హమీం, పుట్టరవి, అక్కపల్లి క్రాంతి,శ్రీకాంత్, వంశీ, క్రిష్ణ, మోహీన్, రజీన, హాజీం పాల్గొన్నారు.


సుల్తానాబాద్‌లో మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

వెయ్యి మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్‌కు చెందిన పలువురు దాతలు బుధవారం స్వచ్ఛందంగా దాదాపు వెయ్యి మట్టి వినాయకుల విగ్రహాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పర్యావరణ హితంగా వినాయక చవితి పండగ జరుపుకోవాలనే ఉద్దేశంతో మట్టి విగ్రహాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకట్‌నారాయణ, రేకులపల్లి విజయ్‌కుమార్, పల్లా సురేష్, తుమ్మ రాజ్‌కుమార్, జూలూరి అశోక్, అల్లెంకి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ట్రినిటీ డిగ్రీ కళాశాల విద్యార్థులు మట్టి విగ్రహాలు తయారు చేసి ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలకు ఫ్రిజ్ అందజేస్తున్న దాతలు

పాఠశాలకు ఫ్రిజ్ వితరణ

గట్టెపల్లి(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: గట్టెపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి అవసరాలకు గ్రామానికి చెందిన వైద్యులు ఎనమల్ల నరేష్, శ్రీదేవి దంపతులు ఫ్రిజ్ వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కొలిపాక అరుణజ్యోతి, నాయకులు ధన్నాయక్ దామోదర్‌రావు, కొలిపాక పెద్దన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ మానుపాటి సంపత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్ష రుసుం గడువు 28

శాతవాహన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ పరీక్ష రుసుం చెల్లింపు గడువు ఈనెల 28తో ముగియనుందని ఆర్బీవీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 500 అపరాధ రుసుంతో ఈనెల 31వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. పరీక్షలు సెప్టెంబర్, అక్టోబర్ మాసంలో జరగనున్నాయని పేర్కొన్నారు.

పీజీ ప్రవేశాల గడువు పొడిగింపు

శాతవాహన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే : కాకతీయ, శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 2017-18 విద్యా సంవత్సరం పీజీ తొలి విడతలో సీటు పొందిన విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు ఈనె 26 వరకు గడువు పొడగించినట్లు శ్రీచైతన్య పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.సదాశివ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో నూతన ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించని వారు ఇప్పుడు దాఖలు చేయాలని సూచించారు. లేదంటే బోధన రుసుం మినహాయింపు వర్తించదని పేర్కొన్నారు.

పోతారం రిజర్వాయరు నింపేవరకూ పోరాడతాం

- రైతులను అవమానిస్తే సహించేది లేదు
- తెదేపా రాష్ట్ర కార్యదర్శి మేడిపల్లి సత్యం



మల్యాలలో విలేకరులతో మాట్లాడుతున్న మేడిపల్లి సత్యం

మల్యాల, న్యూస్‌టుడే: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొడిమ్యాల మండలంలోని పోతారం రిజర్వాయరు నింపే వరకూ రైతుల తరపున పోరాటం సాగిస్తామని తెదేపా రాష్ట్ర కార్యదర్శి మేడిపల్లి సత్యం అన్నారు. పోతారం రిజర్వాయరును పూర్తి చేసి ఎల్లంపల్లి నీటితో నింపాలని అఖిల పక్షాల ఆధ్వర్యంలో చేసిన మహాపాద యాత్రకు రైతుల మద్దతుతో అనూహ్య స్పందన లభిస్తే తెరాస నాయకులు రైతులను అవమానపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. తనను ఏమన్నా భరిస్తానని, రైతులను అవమానిస్తే సహించేదిలేదన్నారు. తమ మహా పాదయాత్రకు స్పందనగా జిల్లా పాలనాధికారి బుధవారం పోతారం రిజర్వాయరును పరిశీలించడం హర్షించదగినదే అయినా త్వరగా రిజర్వాయరును పూర్తి చేసి ఎల్లంపల్లి నీటితో నింపాలని కోరారు. పోతారం రిజర్వాయరు తెదేపా హయాంలోనే 90 శాతం పూర్తయిందని, ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం జరిగిందని తెలిపారు. మల్యాల మండలంలోని కొంపల్లె చెరువు నింపడానికి ఎస్సారెస్పీ కాలువ నీటిని విడుదల చేయించలేని అధికార పార్టీ నాయకులు ప్రాజెక్టుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్సారెస్పీ నీటితో కొంపల్లె చెరువును నింపడానికి 15 రోజుల్లోగా జీవో ఇప్పిస్తానని చెప్పిన జిల్లా మంత్రి ఈటలతో ఇప్పటి వరకూ జీవో జారీ చేయించకపోవడంతో మల్యాల మండలానికి ప్రధాన తాగునీటి వనరుగా వినియోగిస్తున్న కొంపల్లె చెరువు ఏటా ఎండిపోతోందని గుర్తు చేశారు. వారం రోజుల్లోగా కొంపల్లె చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయించకపోతే తాము ఆందోళన చేపడ్తామన్నారు. తమ పార్టీ ఆందోళనల ఫలితంగానే గతంలో నారాయణపూర్ జలాశయాన్ని నింపారని, పంటలు ఎండిపోకుండా వరద కాలువకు ఎస్సారెస్పీ నీటిని వదిలారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బద్దం కిషన్‌రెడ్డి, నులుగొండ సురేష్, ముద్దం రమేష్, శనిగరపు తిరుపతి, భాస్కర్, శేఖర్, గంగారాం పాల్గొన్నారు.

EENADU CLASSIFIEDS

BUSINESS SERVICES

BUSINESS OFFER

Setup your Own Soft Skills Franchise with Min Investment & Earn Regular Income. perfectsoftskills.in ✆ 8639637042/ 9848741400

నెలకు రూ.20 వేలు పైగా ఆదాయం. ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాం. సంప్ర॥ రేవతి: ✆ 91339 39828 & 91339 44327.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. స్కై ఇంజనీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

FOR SALE

LMD కాలనీ తిమ్మాపూర్ నందు ఫాస్ట్‌ఫుడ్ సామాగ్రి మరియు హోటల్ సామాగ్రి అమ్మబడును. Cont: 77026 73662, 98495 07178, 94403 45807.

EDUCATION

DISTANCE EDUCATION

ఒకే సం॥లో ఇంటర్/ డిగ్రీ/ SSC: Direct 10th, Inter, B.A., B.Com, BSc, BLisc, MA, M.Com, MSc, MLisc, MBA, Diploma, B.Tech (All Courses Regd UGC & DEC) Micro Chip Study Circle, MM thota, KNR ✆ 94405 21935/ 97005 59923.

MARRIAGE SERVICES

వైశ్య పెళ్ళి సంబంధాలు

వైశ్య వధూవరుల 8వ పరిచయ వేదిక 27-08-2017 డాక్టర్స్, ఇంజనీర్స్, వ్యాపారస్తులకు, ఎలాంటి కమీషన్ లేకుండా ఒకే రిజిస్ట్రేషన్ ఫీజుతో ప్రతి నెల చివరి ఆదివారం 10 వేదికలు

సుమంగళి సేవా సంస్థ

నిజామాబాద్, సెల్: 9246913222

PERSONAL CLASSIFIEDS

LOST

ఐరెడ్డి మనోహర్ రెడ్డి S/o తిరుపతి రెడ్డి Vill: ముప్పిరితోట మం॥ ఏలిగేడు ఇంటి నుండి జూలపల్లికి ఆటోలో వెళ్తుంటే మార్గమధ్యలో పట్టా పాస్ బుక్ 209, టైటిల్ డీడ్ పడిపోయినది దొరికిన వారు సంప్ర॥ 94932 62163.

బ్యాగ్ పోయినది:- 22/8/2017న శాస్త్రీరోడ్‌లోని విశ్వనాథ్ కాంప్లెక్స్, కరీంనగర్‌యందు నా బ్యాగ్ పోయినది. అందులో విలువైన పేపర్లు, డబ్బులు ఉన్నవి. అట్టి బ్యాగ్ దొరికినవారు క్రింది సెల్ నెంబర్‌కు తెలుపగలరు. ✆ 99487 60529.

REAL ESTATE

జమ్మికుంట గ్రా. నందు సర్వేనెం. 719/A/2 & 719/2/B లలో 6668.88 చ॥గ॥ల స్థలము 2) రేకుర్తి గ్రా. నందు ఇ.నెం. 3-65/1 లో 137 చ॥గ॥లు 3) తీగలగుట్టపల్లి, శ్రీకైలాస రెసిడెన్సి ఫ్లాటు-509-1556 చ॥అ॥లు. సం. 98488 65001, 77939 33657

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర విల్లా ప్లాట్స్ & HMDA గేటెడ్ కమ్యునిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధర రూ॥ 24 లక్షలు. 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. స్కైవే, జీనోమ్ వ్యాలీ, Hyd. ✆ 77020 16545.

PLOT FOR SALE

పెద్దపల్లి జిల్లా భూమ్‌నగర్ క్లాస్ 1 లొకాలిటీలో ఉత్తరం ఫేస్‌తో కల్గిన 527 గ॥ 2 రోడ్లు కల్గిన ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 98492 10517.

TO-LET

KNR జ్యోతినగర్ ఇంగ్లీష్ యూనియన్ వెనుకాల కమలా హెవెన్స్ అపార్ట్‌మెంట్ ఎదురుగా 2nd Floor, 2HBK 7,000/- For Monthly. Cont: 98498 36457, 94400 70194.

JOBS

Primary English Teachers Wanted. Contact: Rainbow E/M High School, Vidyaranyapuri Road No. 1, Karimnagar ✆ 92469 30323.

Tally Erp.9 with GST Course 45 Days. After Job Placements in KNR & HYD. Idea Computers Tally Academy, M.M.Thota, KNR ✆ 81257 91791.

Spoken Hindhi & English Course in Just 45 days. After Job Placements in KNR & Hyd. Idea Computers, M.M.Thota, KNR ✆ 81257 91791.

కరీంనగర్‌లోని హాస్పిటల్స్‌కి స్థానిక సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 7500/- ESI + PF సౌకర్యం సివిల్ హాస్పిటల్ వెనుక మాక్స్‌క్యూర్ హాస్పిటల్ రఘురామ్ 96668 77880.

ఒక ప్రముఖ Ready Mix కంపనీ (NTPC)లో పని చేయుటకు అనుభవం కల సూపర్‌వైజర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, (B.Tech/ Diploma in Civil) కావలెను. Cont: 73068 90162, 80192 66465, 98496 42244.

మెడికల్ ఏజన్సీలో పనిచేయుటకు అనుభవంగల కలెక్షన్ బాయ్స్ & కంప్యూటర్ ఆపరేటర్ (అకౌంట్స్) Female కావలెను. సంప్ర॥ స్వస్తిక్ మెడికల్ ఏజన్సీస్, శాస్త్రీ రోడ్, కరీంనగర్.

ఫీజులేదు Hyd లో ప్రముఖ MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకింగ్‌బాయ్స్, సూ॥వైజర్స్ కా॥ జీ: 13-18 వేలు రూం + భోజనం ఫ్రీ. ESI + PF చదువు లేకున్నా జాబ్, ✆ 7330250599.

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

ప్రముఖ లేడీస్ బ్యూటిపార్లర్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన లేడీ బ్యూటీషియన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. (స్త్రీలకు మాత్రమే) Cont: 93951 01930.

ప్రముఖ కిడ్స్‌వేర్ మరియు టాయ్స్ షాపు నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన సేల్స్‌బాయ్స్ & సేల్స్‌గర్ల్స్ కావలెను మరియు హెల్పర్స్ కావలెను సంప్ర: 80960 80804.

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, ఇన్‌ఛార్జీలు, కావలెను. జీతం:16,000, OT కలదు. రూం+ భోజనం ఫ్రీ. Cell: 81253 05238.

KNR బావ్‌పేట, సుల్తానాబాద్, తిమ్మాపూర్‌లో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జీతం: 7,500-9,000, ఫ్రీ రూం+ భోజనం. అర్హత 5th to డిగ్రీ PRM సెక్యురిటి KNR. Cell: 96405 82975, 95539 11557.

HYD 5 Star Hotels లో ఫిలింస్టార్స్ ఫుడ్ సర్వీస్‌కై క్యాటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. వ॥ 18-30, రూం + మీల్స్ ఫ్రీ. జీ:12000 - 14500 ✆ 7036016128.

ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు సీనియర్, జూనియర్ అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, డేటా ఎంట్రీ, కలక్షన్ బాయ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 13 వేలు - 18 వేలు. రూం + మీల్స్ ఫ్రీ. Q: 10th to any P.G. బైక్ సౌకర్యం కలదు. M/F కావలెను. 7330380732/ 7097722976.

మీ జిల్లా మండలాల్లో ఉద్యోగం కొరకు 10th, Inter, Degree (or) ITI (స్త్రీ//పు) కావలెను. జీతం: 8500 to 10 వేలు. మీ ఫోన్//పోస్టల్ అడ్రస్ SMS చేయండి. శార్వాణి గ్రూప్స్, Hnk., వరంగల్. సంప్ర॥ 8008950772.

ఏ బాదరబందీ లేని 50 సం॥ ఆడ పనిమనిషి ఇంట్లో ఉంటూ పనిచేయుటకు కావలెను. రూం వసతి, జీతం ఇవ్వబడును. Cont: 99592 69799.

ప్రముఖ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బోధించుటకు ఫ్యాకల్టీ కావలెను. విద్యార్హత: B.Sc MLT, M.Sc Microbiology, M.Sc Zoology, BVSC, B.Tech (MEC), B.Sc Nursing, B.Sc Agriculture, Cont: 73865 00758, 90148 98838.

కరీంనగర్ (భగత్‌నగర్)లోని కిరణ్ వాటర్ ప్లాంట్‌లో ఆటోల మీద హెల్పర్‌తోపాటు పోయి క్యాన్లు వేయుటకు ఆటో డ్రైవర్ కావలెను. డ్రైవర్‌కు జీతం 8000/- ✆ 90822 25555 / 94822 25555.

సాఫ్ట్‌వేర్ కంపెనీ నందు సాఫ్ట్‌వేర్ డెవలపర్ (JAVA, ANDROID, SAP) పనిచేయులకు B.E. B.Tech (CS/ IT/ EC)/ MCA 2012 to 16 బ్యాచ్ వారు కావలెను. Cell: 91333 00092.

దావత్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో వర్క్ చేయుటకు క్యాషియర్ కావలెను. అడ్రస్: కరీంనగర్, జగిత్యాల రోడ్ Cont: 70080 12267, 73869 58145.

ఫైనాన్స్ కంపెనీ & చిట్ ఫండ్స్‌లో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q: డిగ్రీ అనుభవం అవసరం లేదు. కరీంనగర్ Cont: 76800 52597.

S.K.V.R కంపెనీలో పనిచేయుటకు B.Sc (కెమిస్ట్రి) ITI ఆల్‌ట్రేడ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ బాయ్స్ సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 10,000 to 17,000/- PM డైరెక్ట్ ✆ 9553650060/ 9553632447.

కొత్తవారు/ అనుభవం గల డాటాఎంట్రీ ఆపరేటర్స్ M/F కావలెను. Day/ Night Shifts For Immediate Joining Karimnagar. Plz Cont: 91005 90930.

WANTED JOB

ప్రముఖ హోల్‌సేల్ బట్టల షాపులో పనిచేయుటకు M/F 30 సం॥లోపు వర్కర్స్ కావలెను. అడ్రస్: కరీంనగర్, శనివారం మార్కెట్. Cont: 95151 31003, 74168 81660.

విలేఖర్లు కావలెను: గత 18 సం॥లుగా హైద్రాబాద్, కరీంనగర్ కేంద్రాల నుండి వెలువడుతున్న ప్రజాతీర్పు (దిన) పక్ష ప్రతికలో పనిచేయుటకు విలేఖర్లు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్ర॥ Cell: 85200 49756, 95336 75169.

FACULTY / TEACHERS

Wanted Teachers to teach Pre/Primary and High School Physical Science. Fluency in English is must. Cont: SSV High School (GGP). Cell: 77299 88488, 76599 24513.

Wanted English speaking Teachers for Primary English and EVS. Contact: United English High School. Kashmeergadda, KNR ✆ 83286 75774.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి క్యారమ్ పోటీలు



క్యారమ్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

జ్యోతినగర్, న్యూస్‌టుడే: రామగుండం ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్‌లోని జ్యోతిక క్లబ్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి సీనియర్ క్యారమ్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. మూడో రోజు జరిగిన క్రీడల్లో ఎస్. రమేష్, ఎం.ఎ. హకీమ్ వేర్వేరుగా వివిధ బోర్డుల్లో ఒకే సారి అన్ని కాయిన్స్ పడగొట్టి ప్రత్యర్థులను అబ్బురపరిచారు. బుధవారం సాయంత్రం వరకు జరిగిన పోటీలో మెన్స్ సింగిల్స్ విభాగంలో ఎం.ఎ. హకీమ్, సయ్యద్ జహీర్‌అహ్మద్, ఎల్. సూర్యప్రకాశ్, ఎస్. నవీన్, ఎండి. అహ్మద్, కె. శ్రీనివాస్, కె. కృష్ణ, ఎస్‌కే. మహమ్మద్ ప్రీక్వార్టర్‌లో సత్తా చాటారు. రాత్రి 10.30 గంటల వరకు క్వార్టర్ ఫైనల్ పోటీలు జరుగుతున్నాయి. మెన్స్ డబుల్స్ విభాగంలో అహ్మద్/మహమ్మద్, సాహిల్/సూరజ్, నవీన్/లలిత్ స్వామి, హకీమ్/షారూఖ్‌ఖాన్, అబ్దుల్లా/మోయిజ్‌లు ప్రీక్వార్టర్‌లో సత్తా చూపారు. క్వార్టర్‌ఫైనల్ పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఉమెన్ సింగిల్స్ విభాగంలో ఉషారాణి, ఎ. స్వాతి, సౌమ్య, ఓ. సునీత మొదటిరౌండ్‌లో విజేతలుగా నిలవగా, తిరుమల, ఆఫ్రాపున్నీసా, కె. పద్మజ రెండో రౌండ్‌లో విజేతలుగా నిలిచారు. మూడోరౌండ్, క్వార్టర్‌ఫైనల్స్ రాత్రివరకు కొనసాగుతున్నాయి. మెన్ వెటరన్ సింగిల్స్ విభాగంలో రెండో రౌండ్ పోటీలో ఎం.వి. రావు, ప్రసాద్, రవిశంకర్, శ్రీరాములు, ఎ. శ్రీనివాసరావు, సీతారామ్, షబ్బీర్‌అలీ, సుబ్రహ్మణ్యం, గిరిధర్, డీపీ. రాజు అత్యధిక స్కోర్ సాధించి విజేతలయ్యారు. కాగా రాత్రి వరకు పూర్తి స్థాయిలో అందరికి క్వార్టర్‌ఫైనల్స్ ముగుస్తాయని రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షులు హరనాథ్ తెలిపారు.

జాతీయ త్రోబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : కర్ణాటకలోని మాండ్యాలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పోనుగంటి శ్రీనివాస్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-19 విభాగంలో పాల్గొన్న ఎ. సాగర్(నగునూర్), ప్రత్యేష(లయోలా), పి. దనూష్ సిద్దాత్(ఐరిస్) పాఠశాలలకు చెందిన ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.



జాతీయ పోటీలకు ఎంపికైనా విద్యార్థులు

'ఈనాడు' ఫొటోగ్రాఫర్‌కు ప్రోత్సాహక బహుమతి



స్పీకర్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న పి.శ్రీనివాస్

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో కరీంనగర్ 'ఈనాడు' ఫొటోగ్రాఫర్ పొన్న. శ్రీనివాస్ ప్రోత్సాహక బహుమతి గెల్చుకున్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జరిగిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చేతులమీదుగా బహుమతి అందుకున్నారు. ఫ్రీలాన్సర్ గాలిపెల్లి రవి వర్మ కూడా ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న రవి వర్మ

బీ-థర్మల్ విస్తరణకు కృషి

రామగుండం, న్యూస్‌టుడే: పట్టణంలోని జెన్‌కో బీ-థర్మల్ విద్యుత్తు కేంద్రం విస్తరణ కోసం తమ సంఘం కృషి చేస్తుందని ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. వి. జాన్‌సన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో కార్మికులతో నాయకులు సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో తమ సంఘాన్ని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ముందుగా బీ-థర్మల్ ప్రధాన ద్వారం నుంచి సంఘ కార్యాలయం వరకు కార్మికులు, ఉద్యోగులు బైక్ ర్యాలీ చేపట్టారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, నాయకులు రమేష్, శ్రీను రఘోత్తం, కిరణ్, స్థానిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జహంగీర్ ఆహ్మద్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.